క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వెన్నా దంపతులు



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న వెన్నా దంపతులు

మార్కాపురం: ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యులు వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర కలిసి ఆయనను సన్మానించారు. వెన్నా మాట్లాడుతూ టీటీడీ చైర్మన్‌గా పశ్చిమ ప్రకాశంలో దేవలయాల అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలతో అవస్థలు

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె, కొత్తపల్లెలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో ఇబ్బందికరంగా మారింది. పాపాయిపల్లెలో పోలేరమ్మ గుడి సమీపంలో పొలాల్లోని ఐదు విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు ఒరిగిపోవడంతో విద్యుత్ తీగలు కిందకు సాగాయి. పొలం సాగు చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లె బస్టాండ్ సమీపంలో సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభం ఇబ్బందికరంగా మారింది. సపోర్ట్ తీగతో కిందపడకుండా ఉందని, ఈదురు గాలులు వస్తే గృహాలపై పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కంభంలో ట్రాఫిక్ రద్దీ

కంభం: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ గతంలో హడావుడి చేసిన పంచాయతీ అధికారులు, పోలీసులు ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగిపోయింది. ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వస్తే మలుపుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు సైతం బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల కోసం వేచి ఉంటుండంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. చౌక్ సెంటర్, కందులాపురం కూడలి, మెయిన్ బజారులో సైతం దుకాణదారులు తమ వస్తువులను రోడ్లపైకి పెడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాలకు జరిమానాలు విధించే పోలీసులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

435 మందికి వైద్య పరీక్షలు

కొమరోలు: మండలంలోని నల్లగుంట్లలో డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 437 మందికి డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి ఆపరేషన్ల కోసం 63 మందిని, ఈఎన్‌టీ ఆపరేషన్ల కోసం ఐదుగురిని, జనరల్ సర్జన్ ఏడుగురిని, ఆర్థోసర్జన్ కోసం ముగ్గురిని ఎంపిక చేశామని, వీరందరికీ కార్పొరేట్ వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోగుల కోసం డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

ఘనంగా కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లెలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ముదిరాజ్ సంఘ నాయకులు పందిళ్ల శ్రీను, రమణ, గురవయ్య పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

గిద్దలూరు రూరల్: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు పొందొచ్చని గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా శనివారం పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులు సక్రమంగా లేవని, వాటిని గమనిస్తూ విద్యార్థులు విద్యపై దృష్టి పెడుతూ మంచి మార్గంలో పయనించేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల వసతులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పారా వలంటీర్ మధు, పాల్గొన్నారు.

నేడు 8 గంటల పాటు సంగీత సమ్మేళనం

మార్కాపురం: పట్టణంలోని రీడింగ్ రూం ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మధుర గాయకుల మేళా (సంగీత సమ్మేళనం) జరుగుతుందని ప్రముఖ న్యాయవాది, గాయకుడు పురాణం సుబ్రమణ్యం తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గాయని, గాయకులు హాజరవుతున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థుల ప్రభంజనం



విజేతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా



ధ్రువపత్రం అందుకుంటున్న వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి బాలస్వామి



శ్రీనివాసులుతో ప్రమాణం చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న నాగమ్మ



డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న మౌనిక

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల 6వ వార్డుకు సంబంధించిన ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి. 6వ వార్డుకు వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ హాజరాబీ 13 ఓట్లతో గెలుపొందారు. మొత్తం 215 ఓట్లు కాగా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ హాజరాబీకి 114 ఓట్లు రాగా టీడీపీ బలపరిచిన వ్యక్తికి 101 ఓట్లు పోల్ అయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ హాజరాబీ 13 ఓట్లతో విజయం సాధించారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ హాజరాబీతో పాటు ఈ విజయానికి కారణమైన మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ యేలం మురళీకృష్ణ పూలమాల వేసి శాలువాతో ఘన సన్మానం చేశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఓబుల్‌రెడ్డిపల్లె పాండురంగారెడ్డి, పగడాల శ్రీరంగం, మార్తోట మురళి, యల్లా రంగస్వామి, యల్లా చంద్ర పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురం మూడో వార్డ్ ఉప ఎన్నిక శనివారం జరిగింది. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి వినుకొండ బాలస్వామికి 111 ఓట్లు, టీడీపీ బలపరిచిన అభ్యర్థి వినుకొండ జీవన్‌కుమార్‌కు 22 ఓట్లు వచ్చాయి. 89 ఓట్ల మెజార్టీతో బాలస్వామి ఘన విజయం సాధించాడు. మొత్తం 166 ఓట్లకు 133 ఓట్లు పోలయ్యాయి. బాలస్వామికి ఎన్నిక ధ్రువపత్రాన్ని ఆర్‌ఓ ఎస్.మధుసూదన్‌రెడ్డి అందజేశారు. ఎన్నికలను కంభం సీఐ రాజేష్‌కుమార్, ఎస్ఐ మాధవరావులు పర్యవేక్షించారు. నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్‌ను ఎంపీపీ ఓసూరారెడ్డి అభినందించారు.

పెద్దారవీడు: మండలంలోని కలనూతల పంచాయతీ పరిధి 6వ వార్డు ఉప ఎన్నిక శనివారం నిర్వహించారు. మొత్తం 194 ఓట్లు ఉండగా 166 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ మద్దతు అభ్యర్థి పంది కాశయ్యకి 49 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి బత్తుల శ్రీనివాసులుకు 117 ఓట్లు వచ్చాయి. టీడీపీ మద్దతు అభ్యర్థిపై వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీనివాసులు మాట్లాడుతూ భారీ మెజర్టీతో గెలిపించిన 6వ వార్డు ఓటర్లకు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ భూలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు పంచాయతీ చింతలపూడిలో పదో వార్డుకి జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి పోసి పోగు మౌనిక 61 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించింది. శనివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉప ఎన్నికకు పోలింగ్ జరిగింది. నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండడంతో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధనరెడ్డి ఆధ్వర్యంలో దర్శి సీఐ జె.రామకోటయ్య పర్యవేక్షణలో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పదో వార్డులో 246 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పది మంది మృతి చెందారు. 236 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 231 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిని పోసిపోగు మౌనికకు 122 ఓట్లు రాగా, టీడీపీ బలపరిచిన అభ్యర్థి దాసరి సోనీకి 39 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆమెకు డిపాజిట్ దక్కలేదు. సంగు విజయలక్ష్మికి 61 ఓట్లు, దాసరి ఎమేలమ్మకి ఒక ఓటు మాత్రమే వచ్చాయి. ఎనిమిది ఓట్లు చెల్లకుండా పోయాయి. ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారి కె. విజయ్‌కుమార్ డిక్లరేషన్ ఫారంను మౌనికకు అందజేశారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధనరెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. దర్శి సీఐ జె రామకోటయ్య పర్యవేక్షణలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్సైలు రామకృష్ణ, వెంకటకృష్ణయ్య, ప్రేమ్‌కుమార్‌లు, ఏఎస్ఐలు మోహనరావు, పవన్‌కుమార్‌లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వార్డు మెంబరుగా గెలిచిన పోసిపోగు మౌనికను వైఎస్సా ర్‌సీపీ నాయకులు బిజ్జం సుబ్బారెడ్డి, దాసరి పెద అంజయ్యలు అభినందించారు.

పొదిలి: మండలంలోని కొండాయపాలెం గ్రామ పంచాయతీలో మూడో వార్డుకు శనివారం ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిని జొన్నలగడ్డ నాగమ్మకు 70 ఓట్లు రాగా, టీడీపీ మద్దతు అభ్యర్థిని జొనమాల రాధకు 59 ఓట్లు వచ్చాయి. దీంతో నాగమ్మ 11 ఓట్లతో గెలుపొందినట్లు ప్రకటించారు.

రాచర్ల: మండల కేంద్రంరాచర్ల 6వ వార్డు ఎన్నికల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాన్ని మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే అభ్యర్థులు మాత్రమే పోలింగ్ కేంద్రం వద్ద ఉండాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా సజావుగా తమ ఓటు హక్కును వినియోగించుకోనేలా వివిధ పార్టీ నాయకులు సహకరించుకోవాలని వివరించారు. గిద్దలూరు సీఐ పి.దేవప్రభాకర్, గిద్దలూరు, రాచర్ల ఎస్ఐలు మహేష్, జి.కృష్ణపావని పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మార్కాపురం టౌన్: చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న రంగనాయక స్వామి, ఆండాళ్ అమ్మవార్ల దేవలయాల శంకుస్థాపన కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, దేవస్థానం చైర్మన్ పి.కేశవరావు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, విశ్రాంత తహసీల్దార్ ఏవీ ఎల్ఎన్‌వీ సుబ్బారావు, పలువురు ఉభయదాతులు పాల్గొన్నారు. ధర్మకర్తలు నాలి కొండయ్య యాదవ్, కౌన్సిలర్ కొత్త కృష్ణా, ఉభయదాతులున్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, భక్తులు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

మార్కాపురం టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని శనివారం సాయంత్రం మార్కాపురం ఫొటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్థానిక వెంకటరమణ స్టూడియో వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రంథే కోటేశ్వరరావు మాట్లాడారు.పి.ఓబయ్య, పి.వెంకటేశ్వర్లు, జి.సురేష్‌కుమార్, జి. నాగరాజు, ఆర్.శ్రీనివాసులు, బాబి, క్లిక్ శ్రీను, యుగంధారాచారి, నారాయణ పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం: సమర్థవంతమైన సుపరిపాలన జరగాలంటే యువత ఓటు కీలకమని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం శ్రీసాధన డిగ్రీ కళాశాలలో మాట్లాడారు. ఎన్నికల డీటీ భాగ్యలక్ష్మి, కళాశాల ప్లేస్‌మెంట్ విభాగాధిపతి పవన్‌కుమార్, రిసర్చి వింగ్ కో ఆర్డినేటర్ శేషుకుమార్, అధ్యాపకులు ఏడుకొండలు, పీఆర్‌కే ప్రసాద్, రంగయ్య పాల్గొన్నారు.

నేడు దొనకొండలో జిల్లా విద్యా సదస్సు

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యా చైతన్య సదస్సు, జిల్లా మధ్యంతర కౌన్సిల్ నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు(ముండ్లమూరు): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వైద్యాధికారి జ్ఞానశ్రీ అన్నారు. మండలంలోని వెలుగువారిపాలెంలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో వైరల్ జ్వరాలు మాత్రమే ఉన్నాయని ప్రజలు అధైర్యపడొద్దన్నారు. గ్రామంలో జ్వరం బారిన పడిన ఏడు మందిని కలిసి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో రెండు రోజులుగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. జ్వరం రాగానే నేరుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందవచ్చన్నారు. హెచ్ఈఓ చంద్రశేఖరబాబు, సిబ్బంది కృష్ణ, మస్తానమ్మ, సుశీల, సుజాత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి ఘన పూజలు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు పూజలు నిర్వహించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

కేజీబీవీ పాఠశాలల అభివృద్ధికి కృషి

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలల అభివృద్ధికి చేయూతనిస్తూ, పాఠశాలల్లో చదివే బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కలిపిస్తోందని జిల్లా జీసీడీఓ ప్రమోద అన్నారు. శనివారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి, పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పది ఫలితాలు రావటానికి కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

కొనకనమిట్ల: అన్ని గ్రామ సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గ్రామ సంఘం అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఐబీడీపీఎం కృపారావు, బ్యాంక్ లింకేజీ యాంకర్ పర్సన్ సుబ్బారావు, ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి, స్త్రీ నిధి మేనేజర్ సులోచన, ఎల్‌సీ నాగభూషణం, సీసీలు యర్రా, రామయ్య, రాజయ్య, సురభయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు దీనమ్మ, అకౌంటెడ్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.

పంట కోత ప్రణాళికలపై జాగ్రత్తలు పాటించాలి

దర్శి: పంటకోత ప్రణాళికలపై జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రంలో డివిజన్ పరిధిలోని పంటకోత ప్రయోగాలకు సంబంధించి ప్రాథమిక కార్యకర్తలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సహాయ గణాంక అధికారులకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ పంట దిగుబడులు అంచనా వేయడం, ప్రభుత్వ ఎగుమతులు, దిగుమతులు అంచనా వేయడం, పంట నష్టాలు జరిగిన సమయాలకు రైతులకు ఆర్థికసాయం మంజూరు చేయడం ఈ పంట కోత ప్రయోగాల ప్రధాన ఉద్దేశమన్నారు. ముఖ్య ప్రణాళిక ఉపగణాంకాధికారి ఎంవీ వాసుదేవరావు, సుధాకర్, ఏఓ బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముండ్లమూరు: మండలంలోని బృందావనం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. రిటైర్డు హెచ్ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మనుమడు తాండవకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, శతకపద్యాల పుస్తకాలు అందజేశారు. గతంలోనూ పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేశారని హెచ్ఎం తెలిపారు. రోటరీ సెక్రటరీ వీరయ్య, హెచ్ఎం జయరామిరెడి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇగ్నైట్ యంగ్ మైండ్స్ పోటీలు

కొనకనమిట్ల: విద్యార్థుల్లో మేధోశక్తినిచ్చేందుకు నైపుణ్య పోటీలు, మానసిక ప్రశాంతతకు ఆటల పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ నరసింహరావు, ఇగ్నైట్ యంగ్ మైండ్స్ నియోజకవర్గ స్థాయి కో ఆర్డినేటర్ రామాంజనేయులు అన్నారు. శనివారం గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం అలీ పర్యవేక్షణలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఇగ్నైటెడ్ యంగ్ మైండ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

పంట దిగుబడిపై మెళకువలు

మార్కాపురం: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మెళకువలను ఆర్‌బీకే సిబ్బంది రైతులకు చెప్పాలని మార్కాపురం ఇన్‌చార్జి ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో మార్కాపురం డివిజన్‌లోని ఆర్‌బీకే సిబ్బందికి పంట కోత ప్రయోగాలు, అధిక దిగుబడుల సూచనలపై, అవగాహన సమావేశం నిర్వహించారు. ఏవోలు డి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, స్వరూప, మాహమ్మద్, బుజ్జిబాయి, ఏఎస్‌వోలు ఎస్‌కే సాహెబ్ పీర్, కార్తిక పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురంలో డీఎల్‌పీఓ ఆర్ పద్మ స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే సిబ్బందితో మాట్లాడుతూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటింటిని సర్వే చేసి వారి స్థల వివరాలను ఆధార్‌కు అనుసంధానం చేయాలన్నారు. గ్రామకంఠ స్థలాన్ని గుర్తించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, బ్రహ్మాచారి, సర్వే సిబ్బంది ఉన్నారు.

వరుణుడి కోసం పూజలు

కురిచేడు: వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా పదును వాన కురవకపోవటంతో మహిళా రైతులు వరుణుడి కరుణకోసం పూజలు ప్రారంభించారు. మండలంలోని కాటంవారిపల్లె గ్రామస్తులు ఆదివారం పట్టాభిరామస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు తయారు చేసి నివేదించారు. నీటిచుక్కకోసం పొలాలు నోళ్లు వెళ్లబెట్టాయని, రైతులు దిగాలు చెందుతున్నారని, వరుణుడి కరుణ కురిపించాలని వేడుకున్నారు.ఈ ఏడాది కూడా గత మూడేళ్ల మాదిరిగానే సకాలంలో వర్షాలుకురిసి ,పంటలు పుష్కలంగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వారు వేడుకున్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొంద్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పంచామృతం, శ్రీచక్రం, కుంకుమ పూజ చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని అకవీడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ నాలుగేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. నవరత్నాల పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏయే సంక్షేమ పథకాలు అందాయి, వాటి ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో ప్రజలకు తెలియజేశారు. ఇంకా ఎమైన సమస్యలు ఉన్నాయా..అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల బుక్‌లెట్లు అందజేశారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ ఓర్వలేక కుట్ర రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మండిపడ్డారు. గ్రామంలోని ప్రతి ఇంటి గడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు తొలుత ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు భారీ గుమ్మడికాయ మాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, అకవీడు సర్పంచ్ తలపాటి దేవదానం, ఎంపీటీసీ నందం రవికుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుప్ప రంగనాయకులు, ఎంపీడీవో కె.కవితా చౌదరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ సూర పాండురంగారెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ చిన్నఅబ్బాయి, వైఎస్సార్ సీపీ నాయకులు కనుమళ్లపూడి గోపి, అన్నా రంజిత్, పగడాల శ్రీరంగం పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ స్వాగతం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

పొదిలి: గడప గడపలోనూ మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఆప్యాయతతో కూడిన స్వాగతాలు, అభిమానంగా పలకరింపులు వస్తున్నాయి. పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలో నిర్మలా కాన్వెంట్ రోడ్డుకు తూర్పు వైపున ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. లబ్ధిదారులు తమకు జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధి గురించి చెప్పారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గడప గడపకు వెళ్ళి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాలనే లక్ష్యంతో కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, నేతలు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జి.చెన్నారెడ్డి, పేరం సుభాష్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, యక్కలి శేషగిరిరావు, ప్రేమ్, బొన్ని, పులుకూరి ఆనందరావు, ఆనికాళ్ళ ఈశ్వరరెడ్డి, దర్‌బాషా, ముల్లా జాకీర్, ముల్లా హసన్‌వలి, మల్లాపురం నరసింహా, జూపల్లి ఏడుకొండలు, ఫిరోజ్, గూడూరి వినోద్, దోర్నాల చిన నారాయణరెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మంగాపురం రమణారెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు బుచ్చనపాలెం యేబు, పయ్యావుల మహేష్, కమిషనర్ డానియేల్ జోషెఫ్, మారుతీరావు పాల్గొన్నారు.

పొదిలి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 203 రోజులు పూర్తయిన సందర్భం శనివారం రాత్రి సంబరాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం నాయకులు, శివాలయం మాజీ చైర్మన్ కంకణాల రమేష్ ఆధ్వర్యంలో, జూనియర్ కళాశాల రోడ్డులోని రమేష్ నివాస గృహం వద్ద భారీగా బాణసంచా కాల్చారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ ఎం.మురళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పట్టణ కన్వీనర్ నూర్జహాన్,గూడూరి వినోద్, ఫిరోజ్, హసన్‌వలి, ముల్లా జాకీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు ముస్కాన్ సర్టిఫికేషన్

యర్రగొండపాలెం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాష్ట్ర స్థాయిలో ముస్కాన్ సర్టిఫికేషన్ లభించింది. వైద్యశాలలో చిన్నపిల్లల వార్డును ముస్కాన్ నిబంధనల ప్రకారం నిర్వహిస్తుండటంతో 92 శాతం స్కోర్ సాధించి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచిందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 21న వైద్యశాలను ముస్కాన్ టీమ్ పరిశీలించింది. లక్ష్యానికి మించి సేవలు అందిస్తుండటం, జన్మించిన శిశువు, జన్మనిచ్చిన తల్లి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించడం, కావలసిన మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడటం, శిశువులకు ఏర్పాటు చేసిన వార్డులు శుభ్రంగా ఉంచడం ముస్కాన్ టీమ్ సంతృప్తి వ్యక్తపరిచిందని తెలిపారు. నేషనల్ టీమ్‌కు చెందిన డాక్టర్ శ్రీవాత్సవ, డాక్టర్ సుప్రియ చౌదరి, రాష్ట్ర టీమ్ సభ్యుడు డాక్టర్ జ్యోతిరెడ్డి, జిల్లా టీమ్ సభ్యుడు మురళీకృష్ణప్రసాద్ వైద్యశాలను పరిశీలించారని చెప్పారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గిద్దలూరు రూరల్: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్వచ్ఛ భారత్ శానిటేషన్ విభాగం అధికారి ఏ.మోహన్‌రావు అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముండ్లపాడులో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. బహిరంగ మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్‌ల పనితీరు విధానాల గురించి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ చెన్నారావు, డీపీఆర్‌సీ సభ్యుడు చక్రధర్‌రావు, ఖాజావలి పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కొమరోలు: మండలంలోని యర్రంశెట్టివానిపల్లె ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంఈవో వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని ఆకవీడులో ఆదివారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.